# మంత్రవాది మహేశ్వర్
# కథలు



# మంత్రవాది మహేశ్వర్ కథలు

మంత్రవాది మహేశ్వర్

## ఇందులోని కథలు


1. కాంస్య విగ్రహం
2. ఎస్కార్ట్
3. అనుభవం
4. డిఏ పెరిగింది
5. జాలిగుండె
6. పంక్చువాలిటీ
7. వంటమనిషి కుదిరింది
8. బక్కెదవ
9. సందిగ్ధం
10. మిస్. వనజ
11. శర్మ సిద్ధాంతం
12. చిట్టి చిన్నారి
13. శ్రీమతి సౌమ్య
14. కాకీ దుస్తుల వెనుక
15. మబ్బులు
16. తన్నీర్ తన్నీర్
17. పారితోషికం
18. సిన్సియారిటీ
19. గణపతిగాత్ర కచేరి
20. సీతోపదేశం
21. తావలచిన రంభ
22. మచ్చ
23. కనకరావు కాంప్లిమెంటరీ
24. చెరవీడిన హృదయాలు
25. గణపతి గడపదాటితే...
26. దేవుడు గీసిన బొమ్మలు
27. అర్థమైంది
28. అద్దం
29. పారసైట్
30. టైగర్ ప్రాన్స్

# కథల్లో కెళ్లేముందు......

చదువుకునే రోజుల్లో "కథలెందుకురా మంచిమార్కులు తెచ్చుకుంటే మంచి ఉద్యోగం వస్తుంది అని మందలించే నాన్న.....
"కథలు వ్రాసి చుట్టాల్లోను, చుట్టుప్రక్కల వాళ్లతోనూ ఇబ్బందులు తెచ్చిపెడుతున్నావు"-కొన్ని సందర్భాల్లో అన్న అమ్మ.....
ప్రముఖ పత్రికల్లో కథలు ప్రచురింపబడ్డప్పుడు "మా మిత్రుడి కథ"
అని గర్వంగా చెప్పే స్నేహితులు.....
నేను కాలేజీలో చదువుతున్నప్పుడు ఆంధ్రపత్రికకు వ్రాసిన కథను ప్రచురించిన వీరాజీగారు "ఇతనికి ఓ యాభైయ్యేళ్లుంటాయేమో, బాగా వ్రాస్తున్నాడు మధ్యతరగతి సమస్యల్ని తీసుకుని" అన్నారని తెలిసి పద్ధెనిమిదవయేట
నేను నవ్వుకున్న సందర్భం.....
"ఏ విషయాన్నయినా తీసుకుని కథా వస్తువుగా మలుచుకుని,
ఆసక్తికరంగా వ్రాయగల నేర్పు వుంది"అన్న కాళీపట్నం మాస్టారి మాటలు.....
విశాఖ ఆకాశవాణిలో పన్జేస్తున్నప్పుడు రచయిత్రి, అనౌన్సర్ శేషారత్నంగారు,
నేను పోటీపడి కథలు వ్రాసిన సందర్భాలు.....
రచయితగా ఎదగడానికి మంచి వాతావరణం కలిగిన అందమైన విశాఖ.....
సాహితీ మిత్రులు మధుచక్రవర్తి, ఇందూరమణ, శ్రీరాజ్, సుందరరామయ్య.....
కథ ప్రచురించబడినా, కార్యక్రమం ప్రసారమైనా ఎంతో అభిమానంతో అభిప్రాయాన్ని వ్యక్తపరచే సహృదయులు
డా. తాడేపల్లి పతంజలిగారు.....
"అన్ని కథలు వ్రాసిన మీరు పెళ్లయ్యాక తగ్గించేసారేం?"
అని చురకలు పెట్టే నా శ్రీమతి వసుమతి.....
నా కథ ఒకటి వినిపించగానే "నేను రాసుకోవాలి బాబూ" అంటూ హడావిడిగా తన గది తలుపు వేసేసుకుని ఓ చిన్ని కథను
వ్రాసేసే మా బబ్లో (శ్రీకంఠ్).....
ఇవన్నీ కథలు వ్రాయడానికి స్ఫూర్తే.....

మంత్రవాది మహేశ్వర్

# మంత్రవాది మహేశ్వర్ కథలు

## కాంస్య విగ్రహం

స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నామన్నంత ఆనందంతో ఎదిగిపోయి కొండలు, చెట్లు-చేమలూ నీలాకాశం వైపు ఎగిరెగిరి చూస్తున్నట్లుగా వున్నాయి.దానిని ఆనుకునే వుంది ఊరు.

ఎప్పటిలాగే నిశ్శబ్దంగా వుంది.

అక్కడో వంతెన.ఆ వంతెనకు కొద్ది దూరంలో విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహం.

ఎటువంటి సంరక్షణా లేక విగ్రహం రూపురేఖలే మారిపోయాయి. అయినా ఆ విప్లవవీరుని కళ్లలో క్రోధం కొట్టచ్చినట్లుగా అలాగే వుంది. పదునైన ఆ చూపులో ఆంగ్లేయులను తరిమికొట్టందే మేంవిశ్రమించం అన్న పట్టుదల ద్యోతకమవుతోంది.

నాదేశప్రజలు బానిసత్వంలో మ్రగ్గడానికి వీల్లేదు అన్న కృతనిశ్చయం ఆ కళ్లలో వుంది.ఏశిల్పి దానిని రూపొందించాడోగానీ, ఆయనకు చేతులెత్తి నమస్కరించవచ్చు అనిపిస్తూంది.

ఒకసారెప్పుడో అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం కొంత ధనసహాయం చేస్తే-రెణ్ణెల్లే నిలిచిన గోడ, నెలరోజులే మిగిలిన గేటు, పార్క్ అన్న రేకుబోర్డూ ఏర్పడ్డాయి.

ఆ తరువాత ఎవరూపట్టించుకోలేదు.

జయంతులూ, వర్ధంతులూ కూడా వెళ్లాయి.

ఆ కాంస్యవిగ్రహం అయినా ఎవరో జమీందారు పూనుకుని ప్రతిష్టించారెప్పుడో. దానికి ప్రక్కగా ఒక గ్రంథాలయం వుంటే బావుంటుందని కట్టించారు. అది ఇప్పుడు శిథిలావస్థలో వుంది.

ఆ పరిసరాల్లోనే వుంటాడు మల్లయ్య తాత.

మల్లయ్యతాతకు తొంభై ఏళ్లుంటాయి. వయసులో వుండగా అతను మంచి ఆజానుబాహుడని, వయసు తీసుకొచ్చిన మార్పువల్ల ఈ రోజు నడుము అలా వంగిపోయిందనీ అర్థమవుతుంది.

ముఖంమీద అనుభవం తాలూకు ముడతలు.

చూపు సన్నగిల్లిన కళ్లు.

ముగ్గుబుట్టలా తయారైన జుట్టు.

'నా' అన్నవాళ్లు ఎవరూలేని ఒంటరివాడు.

చుట్టుప్రక్కల ఇళ్లవాళ్లకి మల్లయ్యతాతంటే కాస్త అభిమానమే.

ఆ అభిమానంతోనే కొందరు తమతోబాటే అనుకుని తమకు మిగిలినదాంట్లో అతనికి పెడతారు తినడానికి.అయినా ఆ ముసలి మల్లయ్య తాతకు ఈ దేశమన్నా, ఈ లోకంలో ఆ వూరన్నా, ఆ ఊర్లో ఆ ప్రదేశమన్నా, ఆ ప్రదేశంలోని ఆ కాంస్య విగ్రహమన్నా అమితమైన అభిమానం.

ఒంట్లో ఓపికున్న రోజుల్లో ఆ విగ్రహాన్ని శుభ్రం చేసేవాడు.కడిగేవాడు. కానీ శక్తి సన్నగిల్లాక, ఆ పనులు చేయలేక కళ తప్పుతున్న విగ్రహాన్ని చూస్తూ కంట తడి పెట్టుకున్నాడు.

క్రోధంగాచూస్తున్న విగ్రహంలోని కళ్లు తనని పలకరిస్తున్నట్లనిపించేది.అందుకేనేమో మల్లయ్యతాత ఒంటరిగానైనా జీవితాన్ని లాగగలుగుతున్నాడు.

బడి అయిపోగానే ఇంటికెళ్లిపోతూ మల్లయ్యతాతని పలకరించే ఏడేళ్ల రవిని ఆ విగ్రహాన్ని శుభ్రపరచడానికి సహాయం చేయమన్నాడు.చేస్తూ చేస్తూ  పైనుంచి జారిపడ్డ బాబు రవికి దెబ్బ తగలడంతో వాళ్లవాళ్లు వచ్చి మల్లయ్య తాతకునాలుగు చివాట్లెట్టి బాబుని ఈడ్చుకు వెళ్లిపోవడంతో ఏనాడూ ఎవరి సహాయం కోరలేదు. అయితే తరచు రవి స్కూలునుంచి పోతూపోతూ తన క్యారేజ్‌లోని భోజనాన్ని తాతకిచ్చి వెళ్లిపోతూంటాడు.

ఎప్పటిలాగే ఆ రోజు రవిస్కూలునుంచి ఇంటికెళ్లిపోతూ తాత దగ్గరికొచ్చాడు. అక్కడున్న అరుగుమీద పడుకుని జ్వరంతో వణుకుతున్నాడు తాత. తనే మందు తీసుకొచ్చి యిచ్చాడు.

ఒకరోజు...

రెండురోజులు..

తాత జ్వరం తగ్గింది. రవికి పట్టలేని ఆనందం. తను తీసుకొచ్చిన మందువల్ల జ్వరం తగ్గిపోయిందని.

ఎప్పుడూ లేని కోలాహలం ఆ ఊర్లో.
అంతా హడావుడిగావుంది.అక్కడ చిరుగుబంత మీద, చిరుగు దుప్పటిని చుట్టుకుని పడుకుని వున్న మల్లయ్య తాతను మరోచోటుకి వెళ్లిపొమ్మన్నారు ఓ నలుగురొచ్చి.
తాత అందుకు ఒప్పుకోలేదు.
"మంత్రిగారు వస్తున్నారు.... ఇక్కడ పెద్ద పండుగ చేస్తారట.శుభ్రం చేయమన్నారు."- అన్నారు వాళ్లు.
శుభ్రం చేస్తామనగానే ఆనందం అనిపించింది గానీ, తనని ఆప్రదేశంనుంచి వెళ్లిపొమ్మనడం చాలా బాధ కలిగించింది.
సీతారామరాజు కాంస్య విగ్రహానికి స్నానం చేయించి శుభ్రపరుస్తున్నారు నలుగురు మనుష్యులు...
రెండుమూడు గంటలసేపు కష్టపడితే ఆ విగ్రహానికి ఎక్కడలేని కళా వచ్చింది.
కొత్తకాంతులతో వెలిగిపోతోందిప్పుడు.
స్వాతంత్ర్యం రాకముందే కన్నుమూసినా, స్వతంత్ర భారతంలో మొట్టమొదటిసారి విగ్రహాన్ని ప్రతిష్ఠించినప్పటి కళ.
ఎన్నోఏళ్లు గడిచినా,మల్లయ్య తాత కళ్లు మరచిపోలేదు ఆ దృశ్యాన్ని. అయితే యిప్పుడు చూపు తగ్గింది. శ్రమపడి చూడాలి.
ప్రతిరోజూ అప్పట్లో ఆ విగ్రహం బాగోగులు చూసిన ఇన్నాళ్లకి మళ్లీ అంతటి ఆనందం.
పసిమి ఛాయలో మెరిసిపోతున్నాడు సీతారామరాజు. దగ్గరగా వెళ్లి కళ్లు పెద్దవిగా చేసుకుని చూసుకున్నాడు.
మరో ముగ్గురు మనుషులు గునపాలతో, పారలతో ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయడానికి వచ్చారు.
అరుగు మీద కూర్చుని ఉన్న తాతని అక్కడ్నుంచి వెళ్లమన్నారు. ఇన్నేళ్లుగా అక్కడుంటున్నా ఎవరూ అలా అనలేదు. తన చివరిశ్వాస కూడా అక్కడే వదలాలని కోరిక. ఉండనిచ్చేట్టు లేరు.
"ఎన్నిసార్లు చెప్పాలయ్యా బాబూ నీకు? మా పనికి అడ్డంగా నువ్వొకడివి."
-వాళ్లు విసుక్కుని కోపాన్ని ప్రదర్శించారు.
కాస్త ప్రక్కకు జరిగాడు కానీ తాత లేవలేదు.
కాసేపటికి- మళ్లీ ఓ ఇద్దరుపనివాళ్లు వచ్చారు.
"ముసలోడా చెబుతుంటే నీక్కాదూ! పో..పో..."- కసురుకున్నాడు వాళ్లలో ఒకడు.
ఇన్నేళ్లనుంచీ ఆ ప్రదేశమంతా స్మశానంలా వుంది. అప్పుడు తనని గురించి పట్టించుకున్నవాళ్లు లేరు. ఈరోజు అందంగా మెరిసిపోతున్న సీతారామరాజుని తన కళ్లతో కష్టపడైనా చూడడానికి వీల్లేదు.
ఇంకాసేపు అక్కడుంటేవాళ్లు రెక్క పట్టుకుని లాబయటకి తరిమేయడం ఖాయం.
మల్లయ్య తాత అక్కడుండగానేరవి పరిగెత్తుకుంటూ వచ్చాడు స్కూలు బ్యాగ్‌తో.
"తాతా...తాతా.,.. నీకు తెలుసా..రేపు అల్లూరి సీతారామరాజు పుట్టినరోజట.అందుకే ఇక్కడంతా ఇలా చేస్తున్నారు.ఇదొక పెద్ద పార్కు చేస్తారు. ఇదేమో లైబ్రరీ..."-ముద్దుముద్దు మాటలతో తాతకు అర్థమయ్యేంత గట్టిగా చెప్పాడు తనకు అర్థమయిందంతా.
తాతయ్య ముఖంలో ఆనందం.
కళ్లల్లో అదోలాంటి మెరుపు.
"ఎవరో మంత్రిగారొస్తారట..."రవి చెబుతున్నదేదీ చెవినబడటం లేదు. ఆ కాంస్య విగ్రహాన్నిచూస్తూ అలానే వుండిపోయాడు.
లైబ్రరీ కాబోతున్న ఆ గట్టు మెట్టు మీద వున్న మాసిన బంత,చిరిగిన దుప్పటినీ దూరంగా విసిరేసారు కోపంగా-"ఎన్నిసార్లు చెప్పాలంటూ".
రవికి కోపం వచ్చింది.
వంగి వాటినిమడిచి తాతకు అందించాడు. తాతయ్య వాటిని పట్టుకుని రెండడుగులు వేసాడు.
"తాతయ్యా! నువ్వు ఇంక ఇక్కడ పడుకోడానికి వీల్లేదు కదా మరేంచేస్తావు?"-అడిగాడు.
"...... ...... ......."తాతయ్య ఒక చిన్న నవ్వు నవ్వుకున్నాడు.
"సీతారామరాజు విగ్రహం శుభ్రంగా కడిగారనినీకు చాలా సంతోషంగా ఉంది కదూ!"
తాత అవునన్నట్లు తలాడించాడు.
"నువ్వు మా ఇంటికొచ్చెయ్యి.ఇక్కడే కదా! పెద్ద అరుగునుంచి నిన్నెవరూ పొమ్మనరులే.మా అమ్మానాన్నలకుచెబుతాను. రోజూ అన్నంకూడా పెడతారు."
మల్లయ్య తాత కళ్లలో నీళ్లు తిరిగాయి.
"ఈ పసివాడిలో వున్నమానవత్వం ఈ మనుష్యుల్లో కరువైందేమిటి?' అని ఆలోచించనేలేదుతాత...అయినా నీళ్లు తిరిగాయి.
ఇన్నేళ్లూ- అక్కడే ఆ కాంస్య విగ్రహం దగ్గరే గడిపిన తనని ఒక్కసారి పొమ్మనగానే ఏదో బాధ...ఏదో ప్రేగు కదిలినట్టయింది. బంధాన్ని

త్రెంచినట్లనిపించింది.ఇన్నేళ్లకు స్వాతంత్ర్య సమరంలో కన్నుమూసిన విప్లవవీరుడు గుర్తుకురావడం ఆనందం కలిగించింది. తను యింకెన్నాళ్లు బ్రతుకుతాడు? అయితే ఆ 'కాంస్య విగ్రహం' ప్రతి ఒక్కరి గుండె తలుపూ తట్టాలి. ఈ దేశంకోసం ప్రాణాలర్పించడానికైనా సిద్ధం కావాలనే సందేశం అనుక్షణం మార్మోగాలి.

ఆ సాయంకాలం రవి తీసుకెళ్లిన చోటుకు వెళ్లాడు.

క్షణమొక యుగంలా అనిపించింది తాతకు. నిద్రపట్టలేదు రాత్రంతా....

అర్ధరాత్రి లేచాడొకసారి.

ఆ కాంస్య విగ్రహాన్ని చూడాలనుకున్నాడు. కానీ ఓపిక లేదు. చీకటిలో నడిచి వెళ్లడం మరీకష్టం.

ఎప్పుడు తెల్లవారుతుందా అని మెలకువగానేవున్నాడు.

తెల్లారితేనే సీతారామరాజు జయంతి.

కాంస్య విగ్రహానికి పూలమాలలు వేస్తారు. ఎక్కడెక్కడనుంచో పెద్ద పెద్దవాళ్లంతా వస్తారు.తన సీతారామరాజుగురించి మాట్లాడతారు.చప్పట్లు కొడతారు. ఆ వేడుక చూస్తే చాలు ఈ జీవితానికింకేం కావాలి?అనుకున్నాడు.

రోజూలాగే తెల్లారింది.

మల్లయ్య తాతకి తెల్లారడం ఆలస్యమయిందనిపించింది.

రవిస్కూలుకి వెళ్తూ –"తాతయ్యా వెళుతున్నా" అంటూంటే తనూ వస్తానని కాంస్య విగ్రహం దగ్గరకి వచ్చాడు.

పనులన్నీ హడావుడిగా జరుగుతున్నాయి.

షామియానాలు కట్టారు.స్పీకర్లు తగిలించారు.లైబ్రరీకి రంగులు పూసారు.

ఎండకి, వానకి తట్టుకోవడానికన్నట్లో, మరెందుకో కాంస్య విగ్రహానికి షెల్టర్ కట్టేసారు.దానికి రంగులు..తోరణాలు...

అంతే కాదు.

అక్కడ అతికించిన పాలరాతి పలకపైన రాబోయే మంత్రిగారి పేరు అన్నిభాషల్లోనూ.

ఓ మూలగా కూర్చుండిపోయాడు మల్లయ్య తాత.

ఔ ఔ ఔ

సాయంకాలం అయిదయింది.

జనంతో ఆ ప్రదేశమంతా కళకళ్లాడిపోతోంది.

ఏనాడూ తన జీవితంలో ఇంతమందిని అక్కడ చూడలేదు మల్లయ్య తాత.

నిజంగా పండుగరోజులా అనిపించింది తాతకి.

విశాలమైన వేదిక....

అక్కడ్నుంచి కొంత దూరం వరకూ కుర్చీలు.

మాటలు వినబడవని స్పీకర్కు దగ్గరగా కూర్చున్నాడు మల్లయ్య తాత, వాళ్లు చెప్పేవిషయాలు విందామని.

ఆరుగంటలు.

వరుసగా ఎన్నో కార్లొచ్చాయి.

పెద్ద తెల్లరంగు కారులోంచి చిన్న నల్లమంత్రిగారు దిగారు.

స్పీకర్లోంచి మంగళ వాయిద్యాలు.

మంత్రిగారు– వెనకాల ఓ వందమంది..... కాంస్య విగ్రహం దగ్గరకి వెళ్లారంతా.

మెడలో దండలు వేసారు.కొబ్బరికాయ కొట్టారు.

విప్లవజ్యోతి సీతారామరాజుకీ జై... అన్ని కంఠాలూ ఒక్కసారి ఖంగుమన్నాయి.

లైబ్రరీ గుమ్మానికి కట్టిన ఎర్రరిబ్బను కత్తిరించారు మంత్రిగారు.

కెమేరాలు 'క్లిక్'మన్నాయి.

అక్కడికొచ్చి చూడలేని, చూసే అవకాశంలేని ప్రజలకు వినిపించడానికి,చూపించడానికి ఆకాశవాణి, దూరదర్శన్ సిబ్బంది సిద్ధంగా వుంది.

పెద్దలచ్చి వేదిక నలంకరించారు.

సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఏర్పాటైన సభ అనీ, ఆయనే మనకు ఆదర్శమనీ...ఒక్కొక్కరూ మాట్లాడుతున్నారు.

తరువాతి కార్యక్రమం...

విప్లవజ్యోతి సీతారామరాజు సహచరులైన బ్రహ్మాజీరావు గురించి చెబుతూ...

....ఆయన సీతారామరాజు కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహంగా పాల్గొని సహకరించారని చెబుతూ, ఆయనని ప్రసంగించమని కోరారు.

ఆ తరువాత ఆయనకు సన్మానం మంత్రిగారి చేతే.
పట్టుశాలువ కప్పారు.
వెయ్యినూటపదహార్లు చెక్కురూపంలో అందజేసారు.సీతారామరాజును మరపించేలా పొగిడారు. చప్పట్లు మారుమ్రోగాయి.
విలేఖరుల కలాలు కాగితాలమీద కదులుతున్నాయి.
రికార్డర్‌లు విష్ణుచక్రాల్లా తిరుగుతున్నాయి.
కెమేరా అన్నింటినీ తనలో దాచుకుంటోంది.
మల్లయ్య తాత ఒంట్లో రక్తం మరిగిపోతోంది.
విపరీతమైనకోపం...నిస్సహాయస్థితి.
సీతారామరాజు సహచరులుగా అతనికి సన్మానం జరుగుతున్నందుకు కాదు.
మైకు ముందు చెప్పుకుంటున్న విషయాలకు కాదు.
బ్రహ్మాజీరావు ఎవరో మల్లయ్య తాతకు బాగా తెలుసు.
నిజమే.. అతను సీతారామరాజు కాలంనాటివాడు. అయితే సీతారామరాజును ఆంగ్లేయులకు పట్టివ్వడానికి ప్రయత్నం చేసిన ద్రోహి.
అతని కారణంగానే ఎందరో విప్లవవీరులు బ్రిటిష్ సైనికులకు దొరికిపోయారు.
అంతేకాదు-ఈ రోజున ఈ నిజాన్ని తనుచెప్పినా నమ్మేదెవరు?అందరినీ విడిచి తను బ్రహ్మచారిగా ఉండిపోయి సీతారామరాజు సహచరుడిగా మిగిలిపోయినసంగతి ఎవరికి తెలుసు? అయినా ఆ విషయాన్ని ఊరంతా తెలియజేసుకోవాలని, ప్రచారం చేసుకోవాలనే కోరిక లేదు తనకి.
ఆ రోజు గుర్తొచ్చింది.
ఈ బ్రహ్మాజీరావు కారణంగానే బ్రిటిష్‌సైనికుడికి దొరికిపోవడం, ఆ తరువాత సీతారామరాజు రహస్యం చెప్పమని వేధించడం.....
చెప్పకపోతే......చె-ప్ప-క-పో-తే-
నాలికను కోసేయడం- ఆ తరువాత ఎంతో కష్టంతో బ్రతికి బయటపడటం, సీతారామరాజు చల్లనిచూపుతో తను కోలుకోవడం..
కళ్లముందు కదిలిన గతంలోంచి,ఈ లోకంలోకి వచ్చేసరికి ఫంక్షనైపోయింది.
బ్రహ్మాజీరావుగారు కూర్చున్న ఖరీదైనకారు దుమ్ములేపి వెళ్లిపోయింది.
రేగిన దుమ్ము 'కాంస్య విగ్రహం' క్షణం సేపు కనబడకుండా చేసేసింది.
జనం నెమ్మది నెమ్మదిగా పల్చబడ్డారు.
తనదుప్పటి...బంత...ఆ బంతలో ఓ మడచి వున్న మాసిన సంచీ- ఆ సంచీ లోంచి తడిమి తడిమి తీసాడు- ఓ రాగి కంకణం.
-సీతా రామరాజు తన స్వహస్తాలతో తనచేతులకు తొడిగినది.
ఆ రోజునుంచీ చాలా ఏళ్లపాటు చేతికేవుండేది. కానీచేతికి పడ్డ పుండు వల్ల దానిని తొలగించక తప్పలేదు. అప్పట్లో -
ఆరోజునుంచీ అది తన సంచీలోనే వుంది.రోజుకొకసారైనా దానినిచూసుకోకపోతే మనసు నిలవదు. అది చూడగానే ఏదో అనుభూతి గతం కళ్లముందు కదులుతోంది.
కనబడని రాగి కంకణం...కనిపించే కాంస్య విగ్రహం ...
ఇవే ఇన్నేళ్లూ తనని బ్రతికిస్తున్నవి. మధ్య మధ్య పసివాడి ప్రేమ.
మహామహుల త్యాగాలను తమ స్వార్థాలకు ముడిపెడుతూ కథలను వాస్తవాలుగా చేసి, జనం చేత చప్పట్లు కొట్టించుకుంటూ స్వాతంత్ర్య సమరయోధులుగా చలామణీ అయిపోతున్న కొందరికి నిలయమైన ఈ స్వేచ్ఛాభారతిని చూసే ఆ కాంస్యవిగ్రహం లోని కళ్లు యింకా ఆ క్రోధంతోనే వున్నాయి.
అదే చూపు...
ఆనాడు-నిరంకుశులైన బ్రిటిష్ పాలకులపైన-
ఈనాడు-స్వార్థం నింపుకున్న మనుషులపైన-
అందుకే ఆ చూపు అలాగే వుండిపోయింది.
'క్రోధం తగ్గలేదు" అనుకున్నాడు మల్లయ్య తాత.
నెమ్మదిగా నడుచుకుంటూ కాంస్య విగ్రహం దగ్గరకువెళ్లాడు.ఓపిక తెచ్చుకుని విగ్రహాన్ని ఆప్యాయంగా తడిమాడు. మెడలో గులాబీల దండ మెత్తగా తగిలింది.
ఓ పూవు చేతిలోకి వచ్చిందిఆప్యాయంగా.దానిని కళ్ల కద్దుకుని అక్కడే ఓపిక లేక కూలబడ్డాడు.
ముందురోజు రాత్రంతా, నిద్రలేదేమో ఒకటే నీరసం....

గుండెలో ఏదో చెప్పలేని బాధ...చెప్పలేని నిస్సహాయ పరిస్థితి....
ఆ రాగి కంకణాన్ని ప్రేమగా గుండెలకద్దుకున్నాడు.
మరోసారి ఆ కాంస్య విగ్రహంకేసి చూసే భాగ్యం వుండదేమోఅనిపించింది.తనివితీరా చూసుకున్నాడు.
మసకమసకగా మారి ఆతరువాతేం కనిపించలేదు.
నేలకొరిగి పోయాడు.
ఎవరూ లేరక్కడ.
కాంస్య విగ్రహంలోని క్రోధమైన చూపు-స్వార్థం పెరిగిపోయి ఒక నిస్వార్థ స్వాతంత్ర్య యోధుణ్ణి గుర్తించలేని స్థితిలో వున్న, నేటి సమాజాన్ని చూస్తున్నట్లుగా వుందిప్పుడు.

ఢ ఢ ఢ

(సాహిత్య అకాడమీ“ఒక తరం తెలుగు కథ”-సంపుటిలో ప్రచురితం)

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1951**

* * *